క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఎల్లమ్మ

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలోని హెచ్‌పీసీఎల్ వద్ద వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అతిపురాతనమైన ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి అనంతపురం జిల్లా తాడిపత్రి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఎరువులు అందజేత



రైతులకు ఎరువులు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ఓబులవారిపల్లె : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్వారా మండలంలోని గోవిందంపల్లి, రాళ్లచెరువుపల్లి దళితవాడకు చెందిన రైతులకు ఎరువులను ఉచితంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ అఖిల భారత ఫల పరిశోధన పథకం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద దళిత రైతులకు ఉచితంగా ఎరువులను, సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అరటి రైతులు ఎరువుల యాజమాన్యం పాటించాలని, తెగుళ్ల నివారణ చేపట్టాలన్నారు. పెద్దఓరంపాడు, రాళ్లచెరువుపల్లి, గోవిందంపల్లి రైతులకు రెండు బ్యాగులు యూరియా, ఆరు కిలోల జీవన ఎరువులు, డ్రిప్ ఎరువులను అందజేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ హెడ్ డాక్టర్ వెంకటరమణ, లక్ష్మన్, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ కవిత, టెక్నికల్ అసిస్టెంట్ గోపీ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయి స్వామి

ఓబులవారిపల్లె : సచివాలయ ఉద్యోగులు సమయం పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పేర్కొన్నారు. మంగళవారం ముక్కవారిపల్లె, యల్లాయపల్లె సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయాలు ద్వారా ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, రిజిస్ట్రేషన్‌లు చేయించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన సేవలందించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం వివిధ సమస్యలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితం



సురక్షితంగా కాన్పులు నిర్వహించిన వైద్యాధికారి రాజశేఖర్

ఓబులవారిపల్లె : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కాన్పులు సురక్షితమని వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు గర్భిణులకు సురక్షితంగా ఆరోగ్య కేంద్రంలో కాన్పులు నిర్వహించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ముక్కవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాను బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయ్యిందని ఇప్పటి వరకు ఆపరేషన్ లేకుండా వంద సాధారణ కాన్పులు చేశామన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందిస్తున్న సేవల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ముక్కవారిపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఓబులవారిపల్లె : నేడు బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముక్కవారిపల్లె సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఉదయం 7 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజాక్షేత్రంలో పురుడుపోసుకున్న పార్టీ వైఎస్సార్‌సీపీ



రాజంపేట టౌన్: వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న మేడా, ఆకేపాటి, పోలా



రైల్వేకోడూరు: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రాయచోటి అర్బన్: కేక్ కట్ చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, కౌన్సిలర్లు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

రాయచోటి అర్బన్ : విశ్వసనీయత, విలువలు, సిద్ధాంతాలతో ప్రజాక్షేత్రంలో పురుడుపోసుకున్న పార్టీ వైఎస్‌ఆర్‌సీపీ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న మహానేత వైఎస్‌ఆర్ అకాల మరణం తర్వాత ఆయన లక్ష్యాలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్ జగన్ వైఎస్‌ఆర్‌సీపీని స్థాపించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. విప్లవాత్మక పథకాలతో పారదర్శకంగా, ఆదర్శంగా రాష్ట్రంలో పాలనను సీఎం జగన్ అందిస్తున్నట్టు తెలియజేశారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత జగనన్న పరిపాలనలో ప్రజలకు అందిన నన్ని పథకాలు ఏ ప్రభుత్వంలో అందలేదన్నారు. పేదలు, రైతులు, మహిళలు సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. జగనన్న పాలనకు జనం నీరాజనాలు పలుకుతున్నారన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ప్రజల్లో నిలిచిందన్నారు. పార్టీకి కష్ట, నష్టాలలో తోడుగా ఉన్న ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అందరికి శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాయచోటి వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయం ఆవరణలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఆసిఫ్‌అలీఖాన్, షబ్బీర్, గౌస్‌ఖాన్, ఫయాజ్ అహమ్మద్, నరసింహారెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ హసన్‌బాషా, శ్యామ్‌కుమార్, అన్నాసలీం, భాస్కర్, జాఫర్‌అలీఖాన్, సంజీవ, గువ్వల బుజ్జిబాబు, కొత్తిమీర ప్రసాద్, కొత్తపల్లె ఇంతియాజ్, హజరత్ ఖాదర్‌వలీ, మోక్షిత్, ఫైరోజ్‌ఖాన్, జావీద్, అమీర్, వైఎస్‌ఆర్ ఖదీర్, నాదర్, అశోక్ మాసాపేట రమణ పాల్గొన్నారు.

మేడా భవన్‌లో..

రాజంపేట : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తండ్రి, ఎంఆర్‌కేఆర్ నిర్మాణ సంస్థ అధినేత మేడా రామకృష్ణారెడ్డి కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడా భవన్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి సీఎల్‌పీ నేతగా ఉన్నప్పటి నుంచి ఆయనతో సన్నిహిత సంబంధాలు కలిగిన కుటుంబం తమదన్నారు. బస్సు యాత్ర సందర్భంగా తన స్వగృహానికి వచ్చారని, అధికారంలోకి వచ్చాక నా తనయులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేసుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ పోలా రమణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో..

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ 14వ పార్టీ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ముందుగా జెండా ఆవిష్కరించి భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు టోల్‌గేట్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళి అర్పించారు. అలాగే మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో ఆవిర్భావ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. మాట తప్పం మడమ తిప్పం అన్న వైఎస్‌ఆర్ సిద్ధాంతాన్ని తూచా తప్పక పాటిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరొందారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, వైఎస్ అన్వర్‌బాషా, ఎల్వీ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, డైరెక్టర్లు సుధాకర్‌రాజు, ముజీబ్, గునిశెట్టి ప్రశాంతి, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రామాపురం : మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలోని అల్లాబకాష్ సన్స్ రైస్ మిల్ వద్ద అర్షద్ వెల్డింగ్ వర్క్స్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సరస్వతిపల్లె సర్పంచ్ మునీర్‌బాషా, మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషాలు చలివేంద్రాన్ని ప్రారంభించారు.

గరుగుపల్లెలో వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గాలివీడు : మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించారన్నారు. ప్రభుత్వం చేసిన మేలుని గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి, సర్పంచ్‌లు రామాంజులురెడ్డి, గంగాధర్, వెంకటనారాయణ, అబ్దుల్ రెహమాన్, సిద్దయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో భారీ మెజార్టీ సాధిద్దాం

- 17 నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- సొంత మండల వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు రఘునాథరెడ్డి

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట సీటు వైఎస్సార్‌సీపీదేనని మరోసారి చాటిచెప్పాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు నాగేంద్ర అధ్యక్షతన నందలూరు వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో మేడా భవన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న మిథున్‌రెడ్డి, శాసనసభ స్థానానికి పోటీ చేస్తున్న ఆకేపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. రాజంపేట నియోజకవర్గానికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే ఎవరు గెలుస్తారో అదే పార్టీ అధికారంలోకి రావడం ఆనవాయితీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి గెలవడం తథ్యమని, రెండవసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. ఈనెల 17న ఆదివారం నందలూరు మండలంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలియజేశారు. మండలంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. పార్టీలో చిన్నచిన్న లోపాలు ఉంటాయని, వాటిని సరిచేసుకొని పార్టీ గెలుపు దిశగా ముందుకెళతామన్నారు. మనందరి టార్గెట్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవడమే ధ్యేయమనేది అందరూ గుర్తించుకోవాలన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నందలూరు మేడా సోదరులకు స్వంత మండలం కాబట్టి, వైఎస్సార్‌సీపీకి మెజార్టీ సాధించి పెట్టాలన్నారు. జెడ్పీటీసీ జి.ఉషాసుబ్బారెడ్డి మాట్లాడుతూ అందరం కలసికట్టుగా ఉండి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుందామని చెప్పారు. సమావేశంలో నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, ఎంపీటీసీ పొత్తపి చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగసుబ్బయ్య, అరిగెల నాని, భాస్కర్‌రెడ్డి, పాటూరు మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆడపూరు రాజు, నల్లతిమ్మాయపల్లె నరసారెడ్డి, కాపు నేత నవ్వల చిన్నయ్య, మైనార్టీ నేతలు షావల్లితోపాటు వివిధ ప్రాంతాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీసీ ఫ్రంట్ కన్వీనర్

రాజంపేట : రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిని నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కేఎంఎల్ నరసింహ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేడా భవన్‌లో రఘునాథరెడ్డిని రాజ్యసభకు ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలను తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం చిన్నఓరంపాడు మాజీ సర్పంచ్ పిచ్చన్న కూమార్తె వివాహానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వి.సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టి.సుధాకర్‌రాజు, ముక్కా రమేష్‌కూమార్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంపా బాలిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, కొమ్మూరు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు



ఎంఈఓలను సన్మానించిన ఉపాధ్యాయులు

పుల్లంపేట : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పుల్లంపేట మండల విద్యాశాఖ అధికారులు నాగా తిరుమలరావు, చక్రాధర్ రాజులు అన్నారు. మంగళవారం పుల్లంపేటలోని బీపీ శేషయ్య సంస్కృత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టు అన్నారు. పరీక్షలు రాసేటప్పుడు జాగ్రత్తగా జవాబులు రాయాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈఓలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరదారెడ్డి, భానుప్రకాష్, తిరుపతి, గౌషియా, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామం వడ్డెపల్లెకు చెందిన చింతల రెడ్డన్న (85) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం రెడ్డన్న మృతదేహాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులర్పించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, ఉప సర్పంచ్ రాజబాబు తదితరులు ఉన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : 2024–25 విద్యా సంవత్సరానికి వగళ్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రావణి ఓ ప్రకటనలో కోరారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశాలతోపాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు, ఏప్రిల్ 11 వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

అలరించిన బండలాగుడు పోటీలు

- పోటీలను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలోని టంగుటూరు గ్రామంలో కామాక్షాంబ సమేత శ్రీ కైలాసనాదేశ్వరస్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం బయనబోయిన భాస్కర్ యాదవ్, గుజ్జుల ఈశ్వరయ్య, మందా మురహరి, మందా ఫణీంద్రల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో అనంపురం జిల్లా గార్లదిన్నె రమేష్ ఎద్దు మొదటి బహుమతి సాధించగా ఆకేపాటి అమరనాథరెడ్డి విరాళంగా రూ. 50 వేలు నగదు బహుమతిగా అందజేశారు. ప్రొద్దుటూరు భాస్కర్ రెడ్డి ఎద్దు ద్వితీయ స్థానంలో నిలిచినందుకు చుక్కా వెంకటేశ్వరయ్య అందజేసిన రూ. 40 వేలు బహుమతిని కైవసం చేసుకున్నారు. నందలూరు షేక్ హబీఉల్లా ఎద్దు మూడో స్థానం రాగా బయనబోయిన భాస్కర్ యాదవ్ సౌజన్యంతో రూ. 30 వేలు అందుకున్నారు. కలసపాడు కడప రమణారెడ్డి ఎద్దు నాల్గవ స్థానంలో నిలవగా గీతాల నరసింహారెడ్డి రూ. 20 వేలు అందజేశారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు వర్మ, చంద్రయ్యలు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సిద్దవరం గోపిరెడ్డి, సర్పంచ్ మైనుద్దీన్, ఉప సర్పంచ్ ఇబ్బు, గడికోట వెంకట సుబ్బారెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, అరిగెల సౌమిత్రి, ఆనాల మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ పంపిణీ

రాజంపేట రూరల్ : ఒంటిమిట్ట మండలం దర్జీపల్లి గ్రామానికి చెందిన టి.నాగమునిరెడ్డికి జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో మంగళవారం రూ.6 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయపడుతోందని తెలియజేశారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా

కడప స్పోర్ట్స్: కడప నగరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన 1వ రాయలసీమ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో డీఎస్ఏ జిమ్‌సెంటర్ క్రీడాకారుడు డి. సునీల్ మూడోస్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను డీఎస్‌డీఓ కె. జగన్నాథ రెడ్డి అభినందించారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా చూడమ్మా..



ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సతీమణికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ రవీందర్‌రాజు

లక్కిరెడ్డిపల్లె : ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా చూడమ్మా.. గంగమ్మ అంటూ అనంతపురం గంగమ్మకు మంగళవారం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సతీమణి శివలలిత, కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఈఓ రవీందర్ రాజులు వారికి అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రా రెడ్డి, పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కల్పన, సర్పంచ్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణే ధ్యేయం



ఎల్‌ఈడీ వీధి దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాయచోటి పట్టణ అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రహదారి మార్గంలో రింగ్ రోడ్డు – పెమ్మాడపల్లె చెరువుకట్ట వరకు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు అమర్చిన ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్ల ప్రారంభం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డిలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని గుణ్ణికుంట్ల రహదారి మార్గంలో రహదారిని విస్తరించడంతోపాటు నూతనంగా విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ వీధి లైట్లు ఏర్పాటు చేయించామన్నారు. పట్టణంలోని అభివృద్ధి పనులతోపాటు కూడళ్లలో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు నుంచి ఠాణా వరకు సెంట్రల్ లైటింగ్‌ను త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్, షబ్బీర్, ఫయాజ్ అహ్మద్, నవాజ్, ఆర్ట్స్ శంకర్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

సిద్దవటం : గ్రామాలలో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలో మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లార్వా, ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రతతోపాటు, మురుగు నీరు నిల్వ లేకుండా, కొళాయిలు లీకేజ్ కాకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. అలాగే కీటక జనిత వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శంషాద్‌బేగం, సూపర్‌వైజర్ పద్మా, ఏఎన్ఎం అక్షుమ్మ, ఎంఎల్‌హెచ్ఓ లోకేశ్వరి, ఆశ వర్కర్‌లు, ఓబులమ్మ, భారతి, పద్మజ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి సుబ్బరాయుడు

తలనీలాల సేకరణకు వేలం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మకొండ ఆలయానికి తలనీలాల వేలం ద్వారా రూ. 18.40 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం ఈవో కార్యాలయం వద్ద అమ్మవారి ఆలయంలో ఏడాది పాటు భక్తులు సమర్పించే తలనీలాలను సేకరించుకొనే హక్కు కోసం వేలం నిర్వహించారు. రాయచోటి దేవదాయశాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభించారు. ఐదుగురు ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. సీల్డ్‌టెండర్ ద్వారా రూ.18,11,555లకు టెండర్ దాఖలు చేశారు. బహిరంగ వేలం ద్వారా వైఎస్సార్‌జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ అనే వ్యక్తి రూ. 18.40 లక్షలు పాడి కాంట్రాక్టు దక్కించుకొన్నాడు.

సొంతింటి కలను సాకారం చేశాం



జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న విప్ కొరముట్ల శ్రీనివాసులు



హాజరైన మహిళలు

- 2200 మందికి ఇంటి స్థలాల హక్కు పత్రాలు పంపిణీ
- వైఎస్సార్ చేయూత మెగా చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంపైన వేలాది మంది మహిళలకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దశాబ్దాలుగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మాణం కలగా ఉంటుందన్నారు. ఆ కలలను సంపూర్ణంగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చి నవరత్నాలలో భాగంగా పేదలందరికి ఇల్లు అందించడం సంతోషకరం అన్నారు. మండలంలో 2200 ఇంటి స్థలాల హక్కు పత్రాలు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలతో ప్రతి మహిళ తన కుటుంబాన్ని చక్కదిద్దుకుంటోందని తెలియజేశారు.

వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ

రైల్వేకోడూరు లోని అక్కచెల్లెమ్మలకు నాలుగో విడతగా 3503 మంది డ్వాక్రా మహిళలకు నాలుగవ విడత వైఎస్సార్ చేయూత కింద 6,56,81,250 రూపాయల చెక్కును మండల సమాఖ్య సభ్యులకు అందించారు. రాబోయే ఎన్నికలలో జగనన్నకు తోడుగా నిలవాలని అక్కాచెల్లెమ్మలను కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్, డిప్యూటీ తహసీల్దారు అమరేశ్వరి, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.